ప్రజాశక్తి

మంగళవారం 4 ఏప్రిల్ 2023 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా



ఉడా, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు కన్నుమూత

ఎంఎల్‌ఎ రక్షణనిధి, సిపిఎం నేత తులసీరావు సంతాపం

ప్రజాశక్తి - తిరువూరు : సీనియర్ రాజకీయ నాయకులు కంచి రామారావు (84) సోమవారం తుదిశ్వాస విడిచారు. వయోభారంతో తిరువూరులోని తన నివాసంలో ఆయన నిద్రలోనే కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఐదు నెలలు క్రితం తుదిశ్వాస విడిచారు. భార్య మరణం తర్వాత మానసికంగా కంగిపోయారు.

సుదీర్ఘ రాజకీయ చరిత్ర

సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన నాయకుడిగా రాష్ట్ర స్థాయిలో పేరొందిన కంచి రామారావు తిరువూరు పూర్వ పంచాయతీకి రెండుసార్లు సర్పంచ్‌గా, రెండుసార్లు విజయవాడ - గుంటూరు - తెనాలి - మంగళగిరి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (విజిటిఎం ఉడా) చైర్మన్‌గా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా, ఆలిండియా విప్కో (మిగతా 6లో)

టెన్త్ పరీక్షలు ప్రారంభం

ఎన్‌టిఆర్ జిల్లాల్లో 27,171 మంది, కృష్ణాజిల్లాలో 19,547 మంది హాజరు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్, కలెక్టరేట్ (కృష్ణా) : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో 154 పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు 27,171 మంది పరీక్ష రాశారు. మొత్తం 27,442 మందికిగాను 271 మంది గైర్హాజరయ్యారు. హాజరు 99 శాతంగా నమోదైంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకుకాగా, విద్యార్థులు ఉదయం 8గంటలకే తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో పరీక్షా కేంద్రాల వద్ద కోలాహాలం నెలకొంది. నగరంలోని కర్నాటి రామమోహనరావు, చుండూరి వెంకటరత్నం పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పరిశీలించారు. ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పటిష్టమైన ఏర్పాట్లు చేయడంతో పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలిపారు. అలాగే కృష్ణాజిల్లాలో మొత్తం 19874 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 19,547 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెర సుల్తానా తెలిపారు. 327 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా పరిశీలకులు 9 కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి 6 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 27 కేంద్రాలను మొత్తం 42 పరీక్షా కేంద్రాలను పరిశీలించినట్లు డిఇఒ తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కృష్ణా డిఇఒ తాహెరా సుల్తానా





విజయవాడలోని ఓ పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

జిల్లా పునర్విభజనకు ఏడాది

- ఇంకా వెన్నాడుతున్న సమస్యలు
- అద్దె భవనాల్లోనే పలు కార్యాలయాలు
- పునర్విభజనకు నోచుకోని కార్పొరేషన్లు
- బెజవాడలోనే మరికొన్ని శాఖలు



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కృష్ణా జిల్లా పునర్విభజన జరిగి ఏడాది పూర్తయింది. అయినా పునర్విభజన సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే మిగిలి పోయాయి. పలు శాఖలు విజయవాడకే పరిమితమయ్యాయి. కార్పొరేషన్లు విభజనకు నోచుకోలేదు. విజయవాడ నుంచి తరలివచ్చిన పలు శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు నిర్వహించాల్సి వస్తోంది. 2022 ఏప్రిల్ నాలుగో తేదీన కృష్ణాజిల్లాను పునర్విభజన చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంట్ నియోజకవర్గ ప్రాతిపదికన జరిగిన ఈ పునర్విభజనలో కృష్ణాజిల్లా మూడుగా విభజన అయింది. మచిలీపట్నం, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాలు రెండు జిల్లా కేంద్రాలుగా మారాయి. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలో కలిశాయి. పలు శాఖలకు సంబంధించిన కార్యాలయాలు, విధులు నిర్వహించే సిబ్బందిని సైతం జనాభా ప్రాతిపదికన విభజన చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పునర్విభజనకు ముందు మచిలీపట్నం జిల్లా ప్రధాన కేంద్రమైనా ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలు ఎక్కువగా విజయవాడలో ఉన్నాయి. పునర్విభజన తర్వాత విజయవాడ నుంచి మచిలీపట్నం తరలివస్తున్న పలు శాఖల కార్యాలయాలను తొలుత మచిలీపట్నంలోని సోడా, బీడీ, కిళ్లీ వర్తక సంఘం భవనంలో ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పాత భవనానికి మరమ్మతులు చేపట్టి రంగులద్దారు. ఈ శిథిల భవనం కార్యాలయాల ఏర్పాటుకు అనువుగా లేదనే కారణంతో జిల్లా కలెక్టరేట్, జిల్లా పరిషత్ ప్రాంగణంలోని కార్యాలయ భవనాల్లోనే మరికొన్ని శాఖల కార్యాలయాలను సర్దుబాటు చేశారు. అటవీ, భూగర్భ జలవనరులు, పౌరసరఫరాలతోపాటు మరికొన్ని కీలకశాఖలు చాలావరకు అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

ఇంకా విభజనకాని కార్పొరేషన్లు, పలు శాఖలు

న్యూ అండ్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఆర్‌ఇడిసిఎపి), మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికలాంగ కార్పొరేషన్లు తదితరాలు పునర్విభజనకు నోచుకోలేదు. ఎన్‌ఆర్‌ఇడిసిఎపి, మైనార్టీ, గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్లు విజయవాడలోనే కొనసాగుతున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికలాంగ కార్పొరేషన్లు మచిలీపట్నం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటితోపాటు జిల్లా ఇన్సూరెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎపిజిఎల్‌ఐ) కార్యాలయం, డిప్యూటీ డైరెక్టర్ మైన్స్, సెరీ కల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ (పట్టు పరిశ్రమశాఖ), జిల్లా ఆడిట్ ఆఫీసర్ (ఎజీ), ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్, జిల్లా యువజన సంక్షేమ అధికారి అండ్ సిఇఓ స్టెప్ కార్యాలయాలు, ఏపీఐఐసి, నేషనల్ చైల్డ్ లేబర్ ప్రాజెక్టు జిల్లా కార్యాలయాల పునర్విభజన జరగలేదు. ఇవి విజయవాడ లోనే కొనసాగుతున్నాయి.

మీడియా సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టి మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి జాషువా




22 మంది గంజాయి స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : గంజాయి అక్రమ రవాణాదారులపై ఉక్కు పాదం మోపే ప్రత్యేక కార్యచరణ రూపొందించి ఫలితాలు రాబట్టామని కృష్ణాజిల్లా ఎస్‌పి పి జాషువా తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో 22 మందిని అరెస్టు చేసి 40 కిలోల గంజాయి, 3 గ్రాముల ఎండిఎంఎ, 16 సెల్‌ఫోన్లు, ఆటో, బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మచిలీపట్నంటోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం గంజాయి కేసుల నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఎస్‌పి జాషువా మాట్లాడుతూ గంజాయి కేసులో చిక్కుకున్నది 30 ఏళ్లలోపు వారేనన్నారు. క్షణికానందం కోసం గంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని తెలిపారు. చిన్న వయసులో కేసులపాలై జీవితాలను అగాథం చేసుకుంటున్నారని చెప్పారు. రాబర్ట్ సన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారపురెడ్డి సాయి కుమార్, తుంగల చందు, దాసరి ప్రజ్వల్ కుమార్, విశాఖపట్నంనకు చెందిన కొండరపు లోవరాజు, మచిలీపట్నంనకు చెందిన డొక్కు కాటంరాజు శ్రీనివాసరావు, పాలిశెట్టి పవన్ కుమార్, నూలు సాయి తండ్రి బ్రహ్మంలను ఆదివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని అన్నారు. గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మలవోలుకు చెందిన బలుపూరి కిషోర్, రేపల్లెకు చెందిన పితా రవితేజ, బేతపూడికి చెందిన అమతలూరి దయాకర్ ఐటి చదువును పూర్తి చేసుకొని ఓవైపు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూనే సులభ సంపాదనకు గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ పరిధిలో అంగలూరుకు చెందిన బండి తంబి, గుడ్లవల్లేరుకు చెందిన కొండ రాకేష్, మహమ్మద్ అక్బర్ బాషా, ఉయ్యూరుకు చెందిన కాటూరి సుబ్రహ్మణ్యం, ముదినేపల్లికి చెందిన పెనుమూడి చందు, మండవల్లికి చెందిన మద్రి మెక్ మిలన్ విద్యాలయాలు, గ్రామ మారుమూల శివారు ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారని అన్నారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో విజయవాడకు చెందిన నాగిరెడ్డి తరుణ్, లండ ప్రేమ్ కిరణ్, ఏపూరి బాబురావు, గాజువాకకు చెందిన రేసభు చంద్రశేఖర్ లను అరెస్టు చేశామన్నారు. పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంగూరుకు చెందిన ఘట్టమనేని సాయి ప్రసాద్, గోసాలకు చెందిన గోరంట్ల కిరణ్‌లను నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు డివైఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : 25వేల పోస్టులతో కూడిన మోగా డిఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధతం చేస్తామని డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం డివైఎఫ్‌ఐ రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన విజయవాడ ఎంజి రోడ్డులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రామన్న మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏటా ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా నేటికీ ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చెయ్యలేదని విమర్శించారు. 10 లక్షల మంది నిరుద్యోగులు బిఇడి, టిటిసి పూర్తి చేసి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారని, అందువల్ల తక్షణమే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.కృష్ణ, ఎన్.నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు తెల్లకుల బాజీబాబు, నాయకులు శివ, సంగీతం సురేష్, ఉమామహేశ్వరరావు, రవి, మహేష్, కొండ, సుంకర నాయుడు, నవీన్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మూసివేత విరమించుకోవాలన్నారు.



రంజాన్ వేళలు

వారం		వేళలు
మంగళవారం	ఇఫ్తార్	6.38
బుధవారం	సహరి	4.50

రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

ప్రజాశక్తి-తిరువూరు

మరమ్మతుల పేరుతో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బి రహదారులు నాణ్యతా లోపం కారణంగా ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. తిరువూరు మండలంలో ధ్వంసమైన రహదారుల మరమ్మతులకు అధికారులు టెండర్లు ఖరారు చేయగా వాటిని దక్కించుకున్న సంబంధిత గుత్తేదారులు నిర్మిస్తున్న మరమ్మతులు లోపభూయిష్టంగా ఉండటంతో వాహనదారులకు శాపంగా మారాయి. కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని కొమ్మిరెడ్డిపల్లి రహదారికి ఇటీవల మోక్షం లభించింది. రూ.35 లక్షలతో సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారిని ప్యాచ్ వర్క్ పేరుతో పనులు చేపట్టారు. రోడ్డుకు మరమ్మతులు అంటే అక్కడక్కడ పాడైన ప్రాంతాల్లో అతుకులు వేయడం కాకుండా ఏకంగా మూడు కిలోమీటర్ల వరకు తారురోడ్డుతో నిర్మించాల్సి వుంది. వెడల్పు నాలుగు అడుగులు కూడా లేకుండా నిర్మిస్తున్న ఈ రోడ్డు ఎత్తుపల్లాలతో దర్శనమిస్తుంది. రోడ్డు వేయకముందు ఎలావుందో వేసిని తర్వాత కూడా అలాగే ప్రయాణం ఉందని బైక్, ఆటో తదితర వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై ప్రయాణిస్తుంటే ఒళ్లంతా కదులుతుందని నూతన రహదారి ఇలా ఉంది ఏమిటని వాహనదారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు వేసేటప్పుడు సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వలనే తాము ఇబ్బందులు పడాల్సివస్తుందని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బైపాస్‌రోడ్డు జాతీయ రహదారి నుండి కోకిలంపాడు వరకు, పిటి కొత్తూరు మధిరరోడ్డు నుండి చిట్టేల, చౌటపల్లి, జి.కొత్తూరు వరకు, జి.కొత్తూరు నుండి గానుగపాడు బ్రిడ్జి వరకు వావిలాల నుండి ఎర్రమాడు మీదుగా ఊటుకూరు వరకు, పోలిశెట్టిపాడు నుండి పల్లెర్లముడి వరకు రహదారులకు ఇటీవల మరమ్మతులు చేపట్టారు. కానీ ఆ మరమ్మతులు వేసిన తీరు చూస్తే నాణ్యతా లోపం కొట్టొచ్చినట్లు కన్పిస్తుందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అక్కడక్కడా మరమ్మతులు చేపట్టారు తప్పా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల ఇంకా రహదారులపై గోతులు అలానే ఉండిపోయాయనని ప్రజలు పేర్కొంటున్నారు. మరమ్మతుల్లో కూడా కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కై నాశిరకంగా పనులు చేయడంవలనే అతితక్కువ కాలంలోనే అవికూడా పాడైపోతున్నాయని, ఫలితంగా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తిరువూరు లోని ఎప్పుడు ఆర్‌అండ్‌బి కార్యాలయానికి వెళ్లినా సంబంధిత ఆర్‌అండ్‌బి డిఇఇ అందుబాటులో ఉం డటంలేదని, ఎక్కడికి వెళ్లారని సిబ్బందిని అడిగితే రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయని అక్కడికి వెళ్లివుంటారని సమాధానం చెబుతున్నారని, కానీ మరమ్మతుల పనులు మాత్రం అధ్వాన్నంగా ఎందు కు ఉంటున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.



పేరంటాలమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి-విజయవాడరూరల్: నున్నలో వేంచేసి ఉన్న శ్రీ పేరంటాలమ్మ తిరునాళ్ల సందర్భంగా కెడిసిసి. మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు అమ్మ వార్ల కు సోమవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మ వర్లకు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గుడి వద్ద ఏర్పాటు చేసిన అంకమ్మ తల్లి పురమును సందర్శించారు. అదేవిధంగా భ్రమరాంభ చాలీసా భజన సమాజం చేస్తున్న భజనను వీక్షించారు. ఈ కార్యక్రమంలో నున్న పాల కేంద్రం అధ్యక్షులు బొంతు శ్రీనివాసరెడ్డి, భూముల బాలశేఖర్ రెడ్డి, సుదీప్ రెడ్డి, ఉయ్యూరు రాజశేఖర్, శ్రీనునాయక్, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని తరిమికొడదాం : టిడిపి

ప్రజాశక్తి-నందిగామ: రాష్ట్రం నుంచి వైసిపిని తరిమికొట్టాలని నందిగామ మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య విమర్శించారు.



నందిగామ పట్టణంలోని కాకాని నగర్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలు బూత్ కన్వీనర్లతో సమన్వయం చేసుకుంటూ హౌస్ మ్యాపింగ్, ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ కోట వీరబాబు పాల్గొన్నారు.

సత్యమ్మ అమ్మవారికి విశేష అలంకరణ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం లోని అంబారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారి జాతర



మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు సోమవారం ఆలయ ఈవో కె నాగరాజు ,ఆలయ కమిటీ చైర్మన్ అలోకం శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో అర్చక స్వాములు నందిగామ సుబ్బారావు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణలు కుంకుమార్చన పూజలు, వేద పండితులు దుర్భాకుల రఘునాధ శర్మ అవధాని సూరేపల్లి వీరభద్ర రావులు చండీ సహితరుద్ర హెూమాధి క్రతువులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

37వ డివిజన్లో అన్నదానం

ప్రజాశక్తి-వన్‌టౌన్: టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) సౌజన్యంతో, తెలుగుదేశం నాయకులు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా ఆధ్వర్యంలో నడుస్తున్న మొబైల్ అన్నక్యాంటీన్ ద్వారా సోమవారం 37వ డివిజన్ చిట్టూరి కాంప్లెక్స్ వద్ద టిడిపి యువ నాయకులు కాంద్రేగుల రవీంద్ర చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సాదరబోయిన ఏడుకొండలు, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, గణప రాము, ఈగల సాంబ, ఆదిత్య కిరణ్, ఆళ్ల మోహన్‌రావు, బూదాల నందకుమారి, సోమి వెంకటేశ్వర్లు, అల్లాడి మురళి, దవులూరి బాబురావు, పట్నాల రమణ, దంగేటి శివరాం ప్రసాద్, పాయల రాజు, గుండు సుధాకర్ ,బొక్కం సత్తిబాబు, ముద్దాన నారాయణరావు, వడ్డీ శంకర్ మాచర్ల నరసింహారావు, శ్రీలం దుర్గారావు, దుర్గారావు, రాజగిరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.





272వ రోజుకు అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: టీడీపీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నా క్యాంటీన్ సోమవారం 272వ రోజు కొనసాగుతుంది. జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో వివిధ గ్రామాల నుండి ప్రభుత్వ కార్యాలయాలకు, కళాశాల విద్యార్థులు, ఆసుపత్రి, బ్యాంకులకు, కార్మికులు, దివ్యాంగులు, అభాగ్యులు, విచ్చేసే పేదలు ఆకలితో తిరిగి వెళ్ళకూడదని ఆకలిగా గొన్న ఎంతోమంది నిరు పేదలకు, అన్న క్యాంటీన్ లో 600 మంది కడుపునిండా భోజనం చేశారు. పట్టణ పురపాలక సంఘం 21వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి గెల్లా సంధ్యారాణి వైకుంటేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యుల వితరణతో అన్న క్యాంటీన్లో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. అన్న క్యాంటీన్ లో పుట్టిన రోజు సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమంలో శ్రీరామ్ ధనుంజయ్ చినబాబు, శ్రీరామ్ సాయి ప్రసాద్ ఇతర పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ ధనుంజయ్ చినబాబు, శ్రీరామ్ సాయి ప్రసాద్, మైనేని రాధ, యలమంచలి రాఘవ, కన్నెబోయిన రామ లక్ష్మి, సూర్యదేవర ఉషారాణి రాంప్రసాద్, గొట్టే నాగరాజు, సంగేపు బుజ్జీ బాబు, పున్నా ఉపేంద్ర, నకిరికంటి వెంకట్, సామినేని మనోహర్, శ్రీరామ్ లాలూ, మోహన్ పాల్గొన్నారు.



ఢిల్లీకి తరలివెళ్లిన నేతలు

ప్రజాశక్తి-గంపలగూడెం, మైలవరం : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 5వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి పలు మండలాల నుంచి నాయకులు సోమవారం తరలివెళ్లారు. గంపలగూడెం, తిరువూరు, మైలవరం, చందర్లపాడు, రెడ్డిగూడెం, ఏ కొండూరు తదితర మండలాల నుండి 64 మంది ప్రజాసంఘాల నాయకులు వెళ్లారు. అలాగే విజయవాడ నుండి ఎపి ఎక్స్‌ప్రెస్‌లో 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సిఐటియు, రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు మొత్తం 219 మంది బయలుదేరి వెళ్లారు.



అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-భవానీపురం

అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతిచెందిన సంఘటనపై భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్‌కు చెందిన కర్నాటి గోవింద రెడ్డి కుమార్తె నాగశ్వేతకు 2007 సెప్టెంబర్‌లో ఆవుల పెద్దిరెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దిరెడ్డి సిరి హోప్ పైప్స్ పార్ట్నర్‌షిప్ మీద సొంత బిజినెస్ చేస్తూ భవానీపురం ఆకుల రాజేశ్వరరావు వీధిలో ఉంటున్నాడు. ఉద్యోగం నిమిత్తం కొన్నాళ్లు హైదరాబాద్, విజయవాడ వస్తూ పోతుంటాడు. ఈ నేపథ్యంలో ఈనెల 1వ తేదీ ఉదయం 9.30 గంటల సమయంలో నాగశ్వేత హైదరాబాద్‌లో వున్న తన తల్లిదండ్రులు, భర్తతో వీడియో కాల్ చేసి మాట్లాడింది. తరువాత ఈనెల 2వ తేదీ ఉదయం సుమారు 8.45 గంటల సమయంలో నాగశ్వేత ఇంటిలో తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందింది. దీంతో ఇంటిలోని ఓనర్లు విషయం తెలుసుకుని వచ్చి చూడగా నాగశ్వేత ఉరికి వేలాడుతూ కనిపించింది. ఇంటి యజమానులు హైదరాబాద్‌లో ఉంటున్న భర్త పెద్దిరెడ్డికి, వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న భవానీపురం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్)

బాపులపాడు మండలం, ఏ. సీతారామపురం గ్రామ అంగన్వాడీ పాఠశాలలో పోషణ్ పక్వాడ్ (పౌష్టికాహార పక్షోత్సవం) ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తల్లులకు పౌష్టికాహారంపై, రక్తహీనతపై అవహహన కార్యక్రమం సిడిపిఓ పి. వెంకటలక్ష్మి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ. సీతారామపురం గ్రామ సర్పంచ్ బొర్రపురెడ్డి గణేష్, సిడిపిఓ పి. వెంకటలక్ష్మి, యంఎస్‌కెలు వి. ఝాన్సీ లక్ష్మి, యం. మౌనిక, సూపర్వైజర్ ఎల్ దుర్గాదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-భవానీపురం: డిసిఎం వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన సంఘటనపై భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గొల్లపూడి ఆంధ్ర ఆసుపత్రి సమీపంలోని వెంకట నోవా అపార్ట్‌మెంట్‌లో సుద్దకట్టు శ్రీనివాసరావు, భార్య వీరవల్లి రత్నకుమారి (39)తో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. శ్రీనివాసరావు గొల్లపూడిలో వున్న ఎస్ఎస్‌సి బోర్డు నందు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. వీరి పెద్ద అమ్మాయి పుష్పాంజలి వన్‌టౌన్‌లోని అట్కిన్‌సన్ స్కూల్‌లో మూడవ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం సుమారు 12.45 గంటల సమయంలో స్కూల్ నుంచి పిల్లని తీసుకురావడానికి ద్విచక్ర వాహనంపై శ్రీనివాసరావు, భార్య రత్నకుమారి కలిసి వెళ్తుండగా భవానీపురం గాలిబ్ షాహిడ్ దర్గా దాటిన తరువాత వీరి వెనుక నుండి డిసిఎం వ్యాన్ అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న భర్త శ్రీనివాసరావు రోడ్డుకు ఎడమవైపున పడిపోగా, భార్య రత్నకుమారి కుడివైపు రోడ్డుమీద పడిపోవటంతో డిసిఎం వ్యాను వెనుక చక్రం ఆమెపైకి



ఎక్కింది. దీంతో అక్కడికక్కడే ఆమె చనిపోయింది. దీంతో వెంటనే 108కి సమాచారం అందించగా వారు వచ్చి రత్నకుమారి మృతిచెందినట్లు ధృవీకరించారు. భర్త శ్రీనివాసరావుకు గాయాలు కావటంతో ఆయన్ను దగ్గరలోని ఆంధ్ర హాస్పటల్‌కు తీసుకువెళ్ళారు. సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డిసిఎం వ్యాన్‌ను వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే, చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కారం అందించడానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని జిల్లా ఎస్పీ పి జాషువా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. సమస్యలతో వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులు స్వయంగా స్వీకరించారు.

స్పందనలోని కొన్ని ఫిర్యాదులు: గన్నవరంలో నివాసం ఉంటున్న వద్దుడు నరసయ్యకు ఇద్దరు కుమారులు. ఇరువురికి ఆస్తిని సమానంగా పంచిన కొన్ని రోజులకు పెద్ద కుమారుడు మతి చెందడంతో కోడలు, మనవడు మనవరాలుతో కలిసి ఉన్నాడు. ఇప్పుడు మనవడు ఇంటి నుండి గెంటి తన పేరుపై ఉన్న ఆస్తి రాయాలని, లేకుంటే చంపుతానని బెదిరిస్తున్నాడని వద్దుడు ఫిర్యాదు చేశాడు. చల్లపల్లికి చెందిన శివ తన సమీప బంధువుకి కుటుంబ అవసరాల నిమిత్తం సొమ్మును అప్పుగా ఇచ్చాడు. సగం చెల్లించి, మిగిలిన సగం చెల్లించకపోగా చంపుతానని బెదిరిస్తున్నాడని న్యాయం చేయమని ఫిర్యాదు చేశాడు. శ్రీకాకుళంలో నివాసముండే వివాహిత తనకు 5 ఏళ్ళ క్రితం వివాహం అయిందని, తన వివాహ జీవితంలో ఇద్దరు మగ పిల్లలు ఉన్నారని, తన భర్త అదనపు కట్నం కోసం మరొక వివాహం చేసుకొని తనకు విడాకులు ఇస్తానని అంటున్నాడని న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. పెడన చెందిన వివాహిత లక్ష్మి తన భర్త దుర్వసనాలకు బానిసై చిత్రహింసలకు గురి చేస్తున్నాడని, పెద్దలు మందలించినా ప్రయోజనం లేదని న్యాయం చేయమని ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ సమస్య తీవ్రత దష్ట్యా అధికారులకు బదిలీ చేస్తూ సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు.



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్‌పి జాషువా



గంజాయి స్వాధీనం : ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు డిగ్రీ కాలేజీ రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో కాలేజీ విద్యార్థులకు గంజాయి విక్రయించుచుండగా పోలీసులు సోమవారం వారిని పట్టుకుని వారి వద్ద నుండి ఏడు కేజీల గంజాయిని, రెండు మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి ఏసేబు తెలిపారు. ఈ గంజాయిని గుడ్లవల్లేరు పరిసర ప్రాంతాలకు చెందిన ఆరుగురు యువకులు ఉచ్చల గ్రామం విశాఖపట్నం జిల్లాకు చెందిన కొంద్రపు లోవరాజు వద్దనుండి గంజాయిని తెచ్చుకొని గుడ్లవల్లేరు కాలేజీ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తెలిపారు. కాటూరి సుబ్రహ్మణ్యం (గుడ్లవల్లేరు) రెండు కేజీల గంజాయి, ఎండి అక్బర్ బాషా (కవుతరం) ఫస్ట్ వర్డ్ ఒక కేజీ గంజాయి, బండి తంబి (అంగలూరు) కే జి గంజాయి, కొండ రాజేష్ (నీలకంటేశ్వరపురం గుడ్లవల్లేరు) ఒక కేజీ గంజాయి, పెనుమూడి చందు రంగారావు (ముదినేపల్లి) కేజీ గంజాయి, క్రరే మేక్ మిలాన్‌ల నుంచి (మండవల్లి) కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుస్తున్నట్లు తెలిపారు. తాసిల్దార్ ఎండి రహమాన్ మస్తానా, వీఆర్వో ప్రకాష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల మండలం పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీకాకుళం నది తీరంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసుకు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసు సిబ్బందితో కలిసి ఎస్ఐ సోమవారం ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పందెంరాయుళ్లను అరెస్టు చేయడంతో పాటు ఒక కోడిపుంజును, రూ.5,030ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట, కోడిపందాలు, జూదాలు, చిత్తులాటలు, ఆడేవారి పై కఠిన చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మండల ప్రజలను ఎస్సై కోరారు.



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న దృశ్యం

ల్యాప్‌టాప్‌లు అందజేత

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు) : ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామంలోని వన్ వే మిషన్ సంస్థ ద్వారా ఇద్దరు విద్యార్థులకు లక్ష ముప్పై వేల రూపాయలు విలువ చేసే రెండు ల్యాప్ టాప్ లను కొడాలి జోయల్ సుగుణాకర్ చేతుల మీదగా సోమవారం బహూకరించారు. అమతలూరుకు చెందిన తోడేటి కిషోర్ బి.ఎస్.సి ఎనస్తీసియా చదవగా, నారా అప్పారావు పేటకు చెందిన కుమారి గుణదల బేబీ, బిటెక్ చదివారు. ఇద్దరు విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుల కొరకు సిద్ధపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వన్ వే మిషన్ నాయకులు జోయల్ సుగుణాకర్, ఆర్. లక్ష్మణ రావు, ఆర్. ఫణి, ఎస్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : జుజ్జూరు గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు పమిడిమర్రి నరసింహయ్య జ్ఞాపకార్థం మనవడు గాంధీ ఆర్థిక సాయంతో చల్లపల్లి శ్రీ విజయ సన్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పమిడిమర్రి గాంధీ మాట్లాడుతూ విద్యార్థులు దాతల ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలన్నారు. చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి కీర్తి తేవాలనిసూచించారు. అనంతరం పరీక్ష రాయబోతున్న పదవ తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిల్, స్కేలు వంటి 6 రకాల పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు..

భవిష్యత్తులో మరిన్ని సేవలు : సర్పంచ్



ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామపంచాయతీ ప్రజలకు మున్ముందు మరిన్ని సేవలు చేయనున్నట్లు పంచాయతీ సర్పంచ్ నందిగం మేరీరాణీ అన్నారు. మండల కేంద్రమైన మోపిదేవి గ్రామ సచివాలయం - 1 వద్ద సోమవారం సాయంత్రం మేరీ రాణి కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా మేరీ రాణీ కేకును కట్ చేసి, సచివాలయం, పంచాయితీ, గ్రామ వాలంటీర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేరీ రాణి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో తాను ప్రజలకు మరింత సేవ చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. తన ఉన్నతికి సహకరించిన అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు లకు సర్పంచ్ కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నందిగం అభిషేక రావు, పంచాయితీ కార్యదర్శి కమిలి త్రిపుర సుందరి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానిక తహసీల్దార్ కే విజయ్ కుమార్ కు సోమవారం జనసేన నేతలు వినతిపత్రం సమర్పించారు. చల్లపల్లిలో ఫైర్ స్టేషన్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు అవనిగడ్డ లేక మొవ్వ అగ్నిమాపక కేంద్రాలనుండి వాహనం రావటం వలన జన సేన నాయకులు ఆరోపించారు. అవనిగడ్డ పురవీధులలో ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక,కోడూరు మండలాలకు చెందిన జనసేన కార్యకర్తలు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలో జిల్లా ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, మైనార్టీ జిల్లా నాయకులు ఉస్మాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షులు విమల్ కష్ణ మండలు నాయకులు పాల్గొన్నారు



లంకమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో వేంచేసి ఉన్న శ్రీ లంకమ్మ అమ్మవారి జాతర బుధవారం నిర్వహించ నున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లపై సోమవారం లంకమ్మ అమ్మవారి ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయానికి తరలివచ్చే భక్తులు భక్తులకు కావలసిన ఏర్పాట్లు తాగునీరు వైద్యం తదితరు ఏర్పాట్లతో పాటు భక్తులకు అసౌకర్యం కలక్కుండా భారీకేడ్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా విస్తతమైన పోలీస్ బందోబస్తు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే జాతరకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఆలయ ఈవో పి సీతారామయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ జి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎల్ వివిఎస్ రామకష్ణ, ఇన్చార్జ్ ఎంపీడీవో పి శైలజ కుమారి, మచిలీపట్నం డివిజన్ ఆలయాల తనిఖీ అధికారి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ అన్నపురెడ్డి రామదాసు తదితరులు పాల్గొన్నారు



పిహెచ్‌సి వైద్యాధికారిణిపై విచారణ

ప్రజాశక్తి-పమిడిముక్కల : వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పద్మజాపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేశామని జిల్లా క్షయ వైద్యాధికారి వెంకటరావు అన్నారు. సోమవారం పమిడిముక్కల మండలంలోని వీరంకిలాగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ పద్మజాపై విచారణ జరిపి సిబ్బంది, పలు పార్టీల నాయకుల అభిప్రాయాలను కూడా తీసుకున్నారు. వైసిపి నాయకులు మారుపాక మహేశ్వరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర వైద్య నివాస్ ఆదేశాలతో విచారణ చేశామన్నారు. సేకరించిన అభిప్రాయాలు పైఅధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజ, పాతూరి చంద్రపాల్, సర్పంచ్ ముళ్ళపూడి సునీత, వైయస్సార్ పార్టీ నాయకులు రాము రంగరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, గొరికిపూడి బుజ్జి, కటికల సతీష్ పాల్గొన్నారు

ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదలకు ఎంతో ఉపయోగమని పమిడిముక్కల మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజ అన్నారు. సోమవారం మండలంలోని వీరంకి గ్రామంలో ఉపాధి పనుల్లో భాగంగా కాల్వ పూడికతీత పనులను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసాని నాగేశ్వరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ భవాని పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలంలో...



కోడూరు మండలంలో...

ప్రజాశక్తి- కోడూరు : కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు వద్ద సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కోడూరు మండలం ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, గ్రామ సర్పంచ్ కొప్పనాతి శేషుబాబు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగ కార్యదర్శి కొండవీటి వెంకట నారాయణరావు, ఎన్ ఆర్ జి ఎస్ అధికారులు పాల్గొన్నారు.

'పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని



సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ నాగమణి పేర్కొన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని 6వ అంగన్వాడీ సెంటర్‌లో నందిగామ ప్రాజెక్టు అధికారిణి భాగ్య రేణుకా, సూపర్ వైజర్ ఉషారాణి అధ్వర్యంలో వేల్ బేబీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, సువర్చలా, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి-మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో సోమవారం మైలవవరం పట్టణంలో ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా లయన్స్ క్యాబినెట్ మెంబర్ డాక్టర్ సి హెచ్.బాలగోపాలరెడ్డి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా చిరు



వ్యాపారులకు, చేతి వృత్తిదారులకు గొడుగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం జోన్ చైర్మన్ తిమ్మిన దినేష్‌బాబు, అధ్యక్షులు మద్దినేని శ్రీనివాసరావు, సిహెచ్.రాజారెడ్డి, జాస్తి వెంకటేశ్వరరావు, పులిపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు గగ్గోలు

ప్రజాశక్తి-విజయవాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సర్వశిక్ష అభియాన్ కింద అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసినా బిల్లులు చెల్లించకపోవ డంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. విజయవాడ రూరల్ మండలంలో సుమారు రూ.28 లక్షలకు పైగానే బిల్లులు రావాల్సి ఉంది. స్థానిక నాయకులే కాంట్రాక్టర్లగా మారి పాఠ శాల భవనాల మరమ్మతులు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లను నిర్మించారు. నిర్మా ణాలు పూర్తి కావడంతో వాటిలో తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. కానీ మూడేళ్లగా భవ నాలు నిర్మించినా తమకు నేటికీ బిల్లుల చెల్లింపు పూర్తికాలేదని మాజీ ఎంపిటిసి మహ్మద్ ఇస్మాయిల్ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు వద్ద సోమవారం వాపోయారు. ఈ మేరకు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఇటీవల నాడు - నేడు కింద చేపట్టిన పాఠశాలల అదనపు తర గతి గదులకు బిల్లులు చెల్లించే విషయంలో చూపిస్తున్న శ్రద్ధ. ఎస్ఎస్ఏ భవనాలకు చూపించకపోవడంపై కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిడమానూరులో రూ.15 లక్షలతో అద నపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. రామవరప్పాడులో రూ.5.50 లక్షలు, నున్నలో రూ.1.30 లక్షలు, జక్కంపూ డికి రూ.6 లక్షలకుపైగా బిల్లులు రావాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్ఎస్ఏ నిధులతో చేపట్టిన భవన నిర్మా ణదారులకు బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

రూ.12.92 కోట్ల చెక్కు అందజేత

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: వైఎస్సార్ ఆసరా కింద మూడో విడతగా రూ.12.92 కోట్ల చెక్‌ను ప్రసాదంపాడులో సోమవారం మహిళా గ్రూప్‌లకు అందజేశారు. గన్నవరం పరిధిలోని రూరల్‌లోని తొమ్మిది గ్రామాల్లోని 1303 గ్రూపులకు చెక్కును ఎఎంసి మాజీ చెర్మన్ కొమ్మ కోటేశ్వరరావు(కోట్లు), ఎంపిపి చెన్ను ప్రసన్నకుమారి, జడ్పిటీసి సువర్ణరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకష్ణ, వ్యవసాయ మండలి చైర్మన్ యర్ర్యారెడ్డి నాగిరెడ్డి, ఓంకార్‌రెడ్డి, ఎంపిడిఓ శేషగిరిరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణ అభివద్దిలో భాగంగా మునిసిపల్ ఆఫీస్ ఎదురు ఎన్టీఆర్ రోడ్డు మరియు చందర్లపాడు రోడ్డు లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్ జయరామ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభివద్ధిలో భాగంగా బాక్స్ కల్వర్ట్ మరియు జంక్షన్ స్ప్లే రోడ్డు విస్తరణ పనులు చేపట్టుచున్నందున ఈ నెల 4 నుంచి 18 వరకు ట్రాఫిక్ డైవర్షన్ చేయడమైనదని తెలిపారు. ఈ అభివద్ది పనులకు ప్రజల నుండి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు వారు తగు సౌకర్యం కల్పించాలని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు





ప్రజాశక్తి-కంచికచర్ల: ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష రాసేందుకు సెంటర్లోకి వెళ్తున్న విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తూ లోనికి అనుమతించారు. మండలంలోని పరిటాల జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని విజయవాడ డిసిపి మోకా సత్తిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. స్థానిక అక్షర హైస్కూల్, విజయరాఢి హైస్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్, పరిటాల హైస్కూల్లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలకు 994 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 18 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి ఎల్.చిట్టిబాబు తెలిపారు. **ప్రజాశక్తి-రెడ్డిగూడెం:** రెడ్డిగూడెం మండలంలో మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. **ప్రజాశక్తి-మైలవరం:**. మండలంలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 1169 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 19 మంది గైర్హాజరు అయినట్లు ఎంఈఓ రసం తెలిపారు. ఉదయం 9:45 గంటలకు పరీక్షలు ప్రారంభం కాగా ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఏసీబీ రమేష్, సిఐ రమేష్, ఎస్ఐ రాంబాబులు ఆయా పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. **ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ మండలంలోని మాగల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సీఐ కె.సతీష్ సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నందిగామ మండల వ్యాప్తంగా ఉన్న పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. **ప్రజాశక్తి-వత్సవాయి:** మండలంలో రెండు పరీక్షా కేంద్రాల్లో 374 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు విద్యార్థులు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్లో లయోలా విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలు విద్యార్థులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిషోర్ తెలిపారు. ఉపాధి అవకాశాలు పొందిన విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ ఆంధ్రా లయోలా కళాశాలలో చివరి సంవత్సరం డిగ్రీ కోర్సు చదువుతున్న 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. సిస్టమ్ అండ్ అప్లికేషన్ సర్వీసెస్ అసోసియేట్ పదవికి ఏడాదికి రు. 3.4 లక్షల ప్యాకేజీతో యాక్సెంచర్ ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సహాయ భాస్కరన్, కరస్పాండెంట్ డాక్టర్ సహాయరాజ్, పాల్గొన్నారు.

కంచికచర్లలో 'ఇదేం ఖర్మ'



ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల గొట్టుముక్కల రోడ్డులో సోమవారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పాలన సైకో పాలనను తలపిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, నాయకులు వేమా వెంకట్రావు, అన్నదాత రామకృష్ణ, మన్నే సాత్విక, బర్రె వాసు తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం వైసిపిలో భగ్గుమన్న విభేదాలు


నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే రక్షణనిధి (ఫైల్)

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలో అధికార వైసిపిలో అభిప్రాయ భేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇటీవల తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి కార్యాలయానికి ఈ పంచాయతీ చేరినట్టు సమాచారం. టిడిపి కంచుకోటగా ఉన్న మండలంలో అధికార పార్టీ గ్రామస్థాయి నాయకులు కష్టపడి కేవలం 500 ఓట్ల తేడాకు తీసుకురాగలిగారు. అక్కడ నుండి అధికార పార్టీలో మంచి జరుగుతుందంటూ, అన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహాన్ని ప్రదర్శించారు. దీనికి భిన్నంగా నాయకులు అనేక ఇబ్బందులు గ్రామాల్లో ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఎన్నికల నేపథ్యంలో ముఖ్య నాయకుడిగా కొనసాగుతున్న చెరుకు నరసారెడ్డిని కొంతదూరం పెట్టడంతో పాటు కొత్త నాయకత్వం (మండల పార్టీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావుతో పాటు ఎంపీపీ భర్త గోగులముడి చెన్నకేశవరెడ్డి) తెర మీదకు వచ్చింది. దీంతో మొదలైన విభేదాలు తారాస్థాయికి చేరి తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి వద్ద పంచాయతీ జరిగినట్లు తెలిసింది. గత నాలుగు రోజుల క్రితం కనుమూరు గ్రామంలో జరిగిన ఇరుగ్రూపుల దాడిలో ఈ విషయాలు బట్టబయలయ్యాయి. అధికార పార్టీకి చెందిన పిఎసిఎస్ అధ్యక్షుడు చెరుకు భాస్కర్‌రెడ్డిపై టిడిపి నాయకులు దాడి చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ఒక గ్రూపును పక్కన పెట్టి మరో గ్రూపును వెనకేసుకు రావడం గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ వైనాన్ని నేరుగా ఎమ్మెల్యే సమక్షంలో నరసారెడ్డి గ్రూపుకు చెందిన మరో ముఖ్య నాయకుడు ప్రశ్నించగా ఎమ్మెల్యే వారిపై విరుచుకుపడినట్లు సమాచారం. పార్టీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన మండలానికి చెందిన పెద్ద నాయకులు కాస్త జటిలం చేసే విధంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. మండలంలో కొత్తపల్లి మినహా అన్ని గ్రామాల్లోనూ అధికార పార్టీలో విబేధాలు ఉన్నట్లు సమాచారం. గ్రామాల్లో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వెళ్తే ఎమ్మెల్యే అండదండలు ఉన్న కొందరు నాయకులకు మాత్రమే అధికారులు పని చేస్తున్నారని పలువురు వైసిపి నాయకులు బాహాటంగానే చెబుతున్నారు. మండలంలో జరుగుతున్న విషయాలన్నీ ఎమ్మెల్యే చెవిన ఎప్పటికప్పుడే చేరుతున్నాయని, ఆయన సైతం ఏకపక్షంగా కొందరిని వెనకేసుకు వస్తున్నారని కార్యకర్తలు మండిపడుతున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విబేధాలు లేకుండా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు కోరుతున్నారు.



ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ప్రారంభించారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఉప సర్పంచ్ పాపారావు పాల్గొన్నారు.

అల్ట్రాటెక్‌కు వాటర్ సస్టెనబిలిటీ అవార్డు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ సిమెంట్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్ ఇంటర్నేషనల్‌కు వాటర్ సస్టెనబిలిటీ అవార్డు లభించిందని సంస్థ ప్రతినిధి రామ్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన కార్యక్రమంలో అవార్డును అందచేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సిమెంట్ వర్క్ ద్వారా అమలు చేయబడిన వాటరెడ్ ప్రాజెక్టు కోసం అల్ట్రాటెక్ అందరికీ నీరు కేటగిరి కింద గుర్తింపు పొందిందన్నారు. గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లోని కమ్యూనిటీ నీటి నిర్మాణాలను రక్షించడం , పునరుద్ధరించడం, కోసం ఈప్రాజెక్టు పనిచేస్తుందని తెలిపారు.

తమ్ముడిని చంపిన అన్న

ప్రజాశక్తి-వత్సవాయి: కుటుంబ కలహాల నేపథ్యంలో తమ్ముడిని అన్న చంపిన ఘటన వత్సవాయిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగొల్లు గ్రామానికి మన్నె రాంబాబు భార్య మౌనికతో గొడవ పడటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. చంపుతానని బెదిరించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆదివారం రాత్రి రాంబాబు మళ్లీ గొడవ పడటంతో మౌనిక భయంతో గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. దీంతో రాంబాబు తమ్ముడు మన్నె చంటి (35) భార్య అనూష ఆమెను తప్పించింది. దీంతో ద్వేషం పెంచుకున్న రాంబాబు అనూషను కొట్టి గాయపరిచాడు. నిద్రపోతున్న చంటిని సోమవారం ఉదయం కొట్టి దుప్పటితో ఉరివేసి చంపాడని అనూష తెలిపింది. జగ్గయ్యపేట సిఐ నాగ మురళి, వత్సవాయి ఎస్ఐ అభిమన్యు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'స్పందన' సమస్యలు త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' లాగిన్ కు వచ్చే అర్జీలు సమగ్రంగా పరిశీలించి, అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన సమావేశంలో పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్, డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు కలసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి రీఓపెన్ కేసులు 25 వరకు వచ్చాయని, వీటిని తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్పందనలో మరియు జగనన్నకు చెబుదాం లాగిన్ వచ్చే అర్జీలు సమగ్రంగా పరిశీలించి, అర్జీదారులకు సంతప్తి కరంగా పరిష్కరించినప్పుడు రీఓపెనక్కు అవకాశం ఉండదని ఆ విధంగా పరిష్కరించాలని సూచిం చారు. జగనన్నకు చెబుదాం లాగిన్ లో 55 పెండింగ్ ఉన్నాయని, అర్జీల వారీగా, శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్ సత్వరమే పరిష్కరించాలన్నారు.

జిల్లాల విభజనకు ఏడాది పూర్తి: జిల్లాల విభజన జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గహనిర్మాణ ప్రగతికి సంబంధించి ఇప్పటిదాకా జిల్లాలో 14వేల వరకు గహనిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 22 వేల గహాలు బిలో బేస్మెంట్ లెవెల్ స్థాయిలో, 18 వేలు బేస్మెంట్ లెవెల్లో ఉన్నాయని, ఇవి పూర్తి చేయగలిగితే జిల్లా మంచి ప్రగతి సాధించనట్లు అవుతుందన్నారు. మన జిల్లాలో జగనన్న లేఅవుట్లు ముందుగా మెరక చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని, అందువల్ల గహనిర్మాణం కాస్త ఆలస్యం అయ్యిందని కలెక్టర్ అన్నారు. అయినప్పటికి గహనిర్మాణంలో పురోగతి సాధించినందులకు సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అభినందించారు.

చిరుధాన్యాలతో పోషకాహార ప్రదర్శనను

జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా (పోషకాహార పక్షోత్సవం) ముగింపు సందర్భంగా కలెక్టరేట్ కాంపౌండ్లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలతో పోషకాహార ప్రదర్శనను జిల్లా కలెక్టర్, జేసి, డిఆర్వో సందర్శించి పరిశీలించారు. చిరుదాన్యాలతో తయారు చేసిన పదార్థాలను రుచి చూసి సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో కెఆర్ ఆర్ సీ డిప్యూటీ కలెక్టర్ బి. శివనారాయణ రెడ్డి, సీపీఓ వై. శ్రీలత, డిఎస్ఓ పార్వతి, డ్వామా పీడీ మరియు హౌసింగ్ పీడీ ఇన్చార్జి జివి. సూర్యనారాయణ, డిఆర్డీఏ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, నగరపాలక సంస్థ కమీషనర్ చంద్రయ్య, ఏడీ సర్వే గోపాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

జిల్లాలో వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక,కష్ణా జిల్లా కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులు జె.లక్ష్మణరావు ఎన్ ఎస్ నారాయణ, లు సోమవారం జిల్లా కలక్టర్ రంజిత్ బాషా కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అంకో కంపెనీ వారు పరికరాల గుర్తింపు క్యాంప్లు పెట్టి, ఎవరెవరికి ఏఏ పరికరాలు అవసరమో గుర్తించి 1 సంవత్సరం నాలుగు నెలలు కావస్తున్నా యింతవరకు ఎవ్వరికీ పరికరాలు అందచేయలేదన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నడవలేని వికలాంగులకు త్రీవీలర్ స్కూటీలు యిస్తామని చెప్పి ఇంటర్వ్యూలు కూడా జరిపిఇంతవరకూ ఎవ్వరికీ యివ్వలేదన్నారు. అలాగే మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంపులు సరిగా జరగటంలేదన్నారు.

జిల్లా సమాచారశాఖ అధికారిగా వెంకటేశ్వర ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా ఎం. వెంకటేశ్వర ప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.కలెక్టరేట్ కాంపౌండ్ జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయంలోని జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో ఆయనకు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. గత సెప్టెంబర్ నెలలో అప్పటి డిప్యూటి డైరెక్టర్ ఎస్. మహబూబ్ బాషా పదోన్నతిపై జోన్-4కు ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా బదిలీ కాగా, నెల్లూరులో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం. వెంకటేశ్వర ప్రసాద్ ను జిల్లాలో ఖాళీ అయిన స్థానంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ కమీషనర్ ఇటీవల నియమించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమాభివద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు ఆయన చెప్పారు.అనంతరం మంత్రి జోగి రమేష్,జిల్లా కలక్టర్ రంజిత్ బాషా,జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు ను మర్యాద పూర్వకంగా కలిశారు.

రామాలయం అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో అడిగిన వెంటనే ప్రతిఒక్కరీ సమస్యను ఎమ్మెల్యే వంశీ తీరుస్తున్నారని వైయస్ఆర్సీపీ ఉంగుటూరు మండలం అధ్యక్షులు గుడిసే బాల స్వామి అన్నారు. వెన్నుతల గ్రామంలో రామాలయం అభివద్ధికి ఎమ్మెల్యే వంశీ ఇచ్చిన లక్ష రూపాయలు విరాళం సొమ్మును సోమవారం గన్నవరం లోని పార్టీ కార్యాలయంలో బాలస్వామితో పాటు మండల కన్వీనర్ రవిశంకర్ చేతుల మీదుగా ఆలయ కమిటీ వారికి అందించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ రామాలయ అభివద్ధికి ఆర్థిక సహకారం అందించాలని గ్రామానికి చెందిన పెద్దలు వంశీని కలిసి కోరగా స్పందించిన ఎమ్మెల్యే లక్ష రూపాయలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




సంపత్ ను సన్మానిస్తున్న చలసాని

పనిలో సమర్ధతకు నిదర్శనం సంపత్ : చలసాని

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్‌జంక్షన్) : హనుమాన్‌జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్‌గా వీరమాచినేని సంపత్ వచ్చిన మూడు సంవత్సరాల కాలంలో తనదైన ముద్ర వేసుకున్నారని కష్ణా మిల్క్ యూనియన్ చైర్మెన్ చలసాని ఆంజనేయులు అన్నారు. హనుమాన్ జంక్షన్ పాల శీతల కేంద్రం మేనేజర్ వీరమాచినేని సంపత్ కుమార్ చిల్లకల్లు పాల శీతల కేంద్రం మేనేజర్‌గా బదిలీ అయిన సందర్భంగా సోమవారం సాయంత్రం వీడ్కోలు ,అభినందన సభ కాకాని కళ్యాణ మంటపం లో చైర్మెన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ కరోనా కాలంలో సంపత్ కుమార్ చేసిన సేవలు అమూల్యమైనవని ప్రశంసించారు. అనంతరం సంపత్ కుమార్ ను చైర్మెన్ చలసాని తో పాటు అభిమానులు పూలమా లలతో నూతన శాలువాలతో ఘనంగా సత్కరించారు. నూతన మేనేజర్ కిలారు కిరణ్ కుమార్ ,కష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ పిన్నమనేని లక్ష్మీ ప్రసాద్, గన్నవరం ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ట్రస్ట్ సభ్యులు తుమ్మల రామారావు క్లస్టర్ లోని పాల సొసైటీల అధ్యక్షులు, సూపర్వైజర్లు , వేతన కార్యదర్శులు తదితరులు పాల్గొని పాల్గొని ఘనంగా సన్మానించారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం : మంత్రి

ప్రజాశక్తి-గూడూరు : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సోమవారం గూడూరులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడవ విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని డ్వాక్రా సంఘాల మహిళలకు చెక్కులను అందించారు. గూడూరు మండలంలోని గూడూరు, జక్కంచెర్ల, కలపటం, ఐదుగుళ్లపల్లి, తరకటూరు, కంకటావ, పిజి లంక, నారికెడ్లపాలెం, చిట్టిగూడూరు, కోకనారాయణపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లోని 371 డ్వాక్రా సహాయక సంఘాలకు 3,686 మంది మహిళా లబ్ధిదారులకు రూ.3.69 కోట్ల చెక్కును మంత్రి అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కుల మత ప్రాంత పార్టీలకు అతీతంగా నవరత్న పథకాలను అందిస్తూ సుపరిపాలన చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి విద్యార్థుల భవిష్యత్తు కోసం పెద్ద మొత్తంలో నిధులను



చెక్కు అందిస్తున్న మంత్రి జోగిరమేష్

ఖర్చు చేస్తున్నారని చెప్తూ నాడు నేడు కార్యక్రమంతో పాటశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ ఇస్తున్నారని అన్నారు. ఫ్యామిలీ ఫిజియన్ కాన్సెప్ట్ తో వైద్యాన్ని ప్రజల ఇంటి ముంగిటకు ముఖ్యమంత్రి చేరుస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో మంత్రి తనయుడు జోగి రాజీవ్, జడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు, ఎంపీపీ సంగా మధుసూధనరావు, మండల పార్టీ అధ్యక్షులు గొరిపర్తి రవి కుమార్, పాల్గొన్నారు.

కలెక్టర్ రంజిత్‌బాషాకు సత్కారం



ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : జిల్లాల విభజన, జిల్లా కలెక్టరుగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా. టి ఎస్.ఎస్ బాలాజీ, కార్యదర్శి శంకర్నాథ్ భవిరి, కోశాధికారి కె రామ్ బాలాజీ కలెక్టర్ పి రంజిత్ బాషా ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ కలెక్టర్ అధ్యక్షులుగా జిల్లా రెడ్ క్రాస్ సంస్థ అద్భుతంగా పని చేస్తుందన్నారు. ఈ సంవత్సరం రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు అయిన గవర్నర్ చేతులు మీదుగా అవార్డ్ అందుకున్న ఘనత కష్ణాజిల్లా కలెక్టరుకు దక్కిందన్నారు. రెడ్ క్రాస్ నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన విద్యార్థులను గవర్నర్ అభినందిస్తూ ఇచ్చిన ప్రశంసాపత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.



సాయం అందిస్తున్న దృశ్యం

విద్యార్థి కుటుంబానికి ఆర్ధిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : గత ఫిబ్రవరి 15 న యూనివర్శిటీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం లో మృతిచెందిన కష్ణా యూనివర్సిటీ ఎంసిఎ విద్యార్థి అద్దంకి గణేష్ కుటుంబానికి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది అండగా నిలిచారు. వారు ఒక లక్షా ముప్పై రెండు వేల రూపాయల విరాళాలు సేకరించి ఆ నగదును యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ద్వారా మృతిచెందిన విద్యార్థి తల్లి అద్దంకి ధనలక్ష్మి, సోదరి అద్దంకి. దుర్గా భవానిలకు సోమవారం అందచేసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంసీఎ విభాగపు అధ్యాపకులు ప్రొఫెసర్ వై. కె. సుందర కష్ణా, డాక్టర్ ఆర్. కిరణ్ కుమార్, డాక్టర్ ఆర్. విజయ కుమారి, డాక్టర్ ఎం. బాబు రెడ్డి,వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

60 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ మండలంలోని వేములమడ గ్రామంలో సోమవారం నిర్వహించిన విలేజ్ హెల్త్ క్లినిక్ లో ఫ్యామిలీ ఫిజీషియన్/104 వైద్య సేవలను నిర్వహించారు. మొవ్వ పి.హెచ్ .సీ వైద్యురాలు డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో 60 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ బి విజయ్ కుమార్, ఎం ఎల్ హెచ్ పి అశ్విత, డిఈవో కైలా కోమలి, ఆశా వర్కర్స్ భూలక్ష్మి, విజయకుమారి, డ్రైవర్ రవీంద్ర పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం కోసం నిరసన

ప్రజాశక్తి-గుడివాడ : దళితులకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ ఎన్ని పోరాటాలు చేసిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకార్ అన్నారు. సోమవారం స్థానిక గుడివాడ రెవిన్యూ డివిజనల్ కార్యాలం వద్ద దళితులకు శ్మశానవాటిక స్థలం కేటాయించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకార్, ఆదిమాంధ్ర జిల్లా అధ్యక్షుడు పొంగలేటి జయసరాజు. దళిత నాయకలు మమిళ్ళ ఏలిషా, బలసాని ఏలిషా, గంధం సైమన్‌బాబు, అత్తాటి సాల్మన్, కమల, రాజు, మణిక్యలరావు, కొడాలి బాబు, యోహన్‌లు మాట్లాడుతూ గుడివాడలోని రైలుపేట, కార్మికనగర్, గుడ్‌మెన్‌పేట, పాముల కాలనీ, నాగన్న చెరువు గట్టు, దొండపాడు కాలనీ ప్రాంతాల్లో నివసిస్తున్న దళిత ప్రజలు గత 120 సంవత్సరాలుగా రైలుపేటలోని స్మశాన వాటికను వాడుతున్నారన్నారు. 20 సంవత్సరాలుగా స్మశానంలో స్థలం అంత శవాలతో నిండిపోవడంతో ఒక్కొక్క జాగాలో ఏడు, ఎనిమిది శవాలను పెట్టాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. తక్షణమే స్మశాన వాటికకు



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

కావలసిన భూమిని మంజూరు చేయలన్నారు. అనతరం ఆర్‌డివోకు విన్నతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, దళిత నాయకలు పాల్గొన్నారు.

వ్యవస్థల పరిరక్షణకు ప్రజల్లో చైతన్యం అవసరం

'భారత్ బచావో' రాష్ట్ర ప్రథమ మహాసభలో నేతలు

ప్రజాశక్తి - విజయవాడ : రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం పరిరక్షణకు ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. మౌలిక సమస్యలను ఏమాత్రం పరిష్కరించకుండా, ప్రజలను మత ప్రాతిపదికన చీల్చి పాలిస్తున్న బిజెపి ప్రజా వ్యతిరేక దుష్ట విధానాలను ముక్తకంఠంతో గర్హించారు. 'భారత్ బచావో' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రథమ మహాసభ నగరంలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ మహాసభలో మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా చైర్మన్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రస్తుత విధానాలు ఇలాగే కొనసాగితే మున్ముందు ఎన్నికలే ఉండకపోవచ్చని, అధ్యక్ష తరహా పాలన తీసుకువస్తారేమోనని ఆందోళన వ్యక్తంచేశారు. మతోన్మాదుల కుట్రలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారత్ బచావో ఉద్యమం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. భారత్ బచావో ఉద్యమ జాతీయ నాయకులు, ఎపి ఇన్చార్జి డాక్టర్ ఎఫ్.ఎం. గోపీనాథ్ మాట్లాడుతూ దేశ ప్రజల ఆకాంక్ష రూపమే భారత్ బచావో అని వివరించారు. భారత సమాజ మానసిక స్థితి ఆందోళనకరంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రారంభ సభకు సీనియర్ సామాజిక కార్యకర్త రంగారెడ్డి (జర్నలిస్ట్), రెండో సెషన్‌కు సీతామహాలక్ష్మి, కె ఎం సుభాన్ అధ్యక్షత వహించారు. భారత్ బచావో రాష్ట్ర కౌన్సిల్‌కు సీ.భాస్కరరావును చైర్మన్‌గా, 15 జిల్లాల నుంచి పాల్గొన్న 98 మంది ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభ 25 మందిను కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకుంది. సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు అక్కినేని వనిజ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి రమణ రెడ్డి, సిపిఐ ఎంఎల్ రెడ్‌స్టార్ పొలిట్‌బ్యూరో సభ్యులు హరి ప్రసాద్, ద్రావిడ సమ్మేళనం కన్వీనర్ ఆకురాతి మురళీకష్ణ, ఎం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణరావు, స్టెప్ నాయకులు ప్రత్యూష సుబ్బారావు పాల్గొన్నారు. ఆంధ్ర, నాగార్జున యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్లు కె.ఎస్ చలం, సత్యపాల్, నూరు అబ్దుల్‌బాష, ఎన్.అంజయ్య తదితరులతో రాష్ట్ర సలహా మండలిని ఏర్పాటు చేశారు.

ఉడా, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

డైరెక్టర్‌గా పలు బాధ్యతలు నిర్వర్తించారు. కాంగ్రెస్ పార్టీలో పిసిసి సభ్యులుగా, కాంగ్రెస్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా కొనసాగుతున్న సమయంలోనే 2019 ఎన్నికలకు ముందు ఆయన టిడిపిలో చేరారు. వయోభారంతో ఉన్న ఆయన ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. 55 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఆయన కాంగ్రెస్ పార్టీలోని జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలతో మంచి సంబంధాలున్నాయి. మర్రి చెన్నారెడ్డి, జనార్దన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో కృష్ణాజిల్లాలో కాంగ్రెస్ బాధ్యతలు చూశారు. తిరువూరు నియోజకవర్గంలో తనకంటూ ఓ రాజకీయ ముద్ర వేసుకున్నారు. వర్షాధారితమైన తిరువూరు నియోజకవర్గంలో జమిందార్లు తవ్వించిన 300 చెరువులను అభివద్ధి చేసేందుకు వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఎంతో కషి చేశారు. ఈప్రాంతలో ప్రతి ఒక్కరినీ పేరుతో పిలవగలిగే రాజకీయ నేతగా ఉన్నారు. అమెరికాలో ఉంటున్న ఆయన కుటుంబ సభ్యులు రాగానే అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 5వ తేదీన వారు రావచ్చని భావిస్తున్నారు.

పలువురు నేతల నివాళులు

కంచి రామారావు భౌతికకాయాన్ని పలువురు నేతలు సందర్శించి సంతాపం తెలిపారు. పూలమాలలువేసి నివాళు లర్పించారు. కంచి రామారావు మరణవార్త వినగానే ఆయన అభిమానులు శోకసముద్రంలో మునిగిపోయారు. తిరువూరు ఎంఎల్ఎ కొక్కిలిగడ్డ రక్షణనిధి తదితరులు ఆయన భౌతికకాయంపై పూలమాలవేసి నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. టిడిపి తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జి శావల దేవదత్, నాయకులు తాళ్లూరి రామారావు, మర్సకట్ల కుమార్, యంద్రాతి చంద్రం, మధు తదితరులు కూడా ఆయన భౌతికయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సిపిఎం సీనియర్ నాయకులు బి.ఆర్.తులసీరావు సంతాపం

కంచి రామారావు మృతి పట్ల సిపిఎం సీనియర్ నాయకులు, ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు బి.ఆర్.తులసీరావు సంతాపం తెలిపారు. కంచి రామారావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తిరువూరు హైస్కూల్‌లో కలిసి చదువుకున్నామని, తనకన్నా మూడేళ్లు సీనియర్ అయిన కంచి రామారావు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్న సమయంతో తాను సిపిఎం ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శిగా ఉన్నానని గుర్తుచేసుకున్నారు. పంచాయతీలో పలు సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కలిసి పనిచేశామని పేర్కొన్నారు. ఆయనతో తనకు 65 ఏళ్ల పరిచయం ఉందని, ఆయన కుటుంబంతోనూ ఎంతో అన్యోన్యతతో మెలిగామని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

స్పందనలో 14 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం విఎంసి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో మొత్తం 14 అర్జీలు వచ్చాయి. వీటిలో ఇంజనీరింగ్ విభాగం 4, పట్టణ ప్రణాళిక విభాగం 6, పబ్లిక్ హెల్త్ విభాగం 2, రెవిన్యూ 1, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి)- విభాగం నుండి ఒక అర్జీ వచ్చింది. అదనపు కమిషనర్ (జనరల్) యం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. పి.రత్నావళి పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
EP No. 68 of 2020
in
O.S No. 1463 of 2010

Between:
Kapil Chit Funds Pvt. Ltd
Vijayawada-1 Branch, Rep. by It's
Assistant Divisional Manager
... DHR

AND

Manepally Venkata Satyanarayana
and others
... JDRS

Notice to JDR No. 3.
Koppu Venkateswarlu, S/o. Rangaiah, Cleaner, PF No. 09925648, Employee No. 2132, Commercial Department, SC Railway, Vijayawada.
(JDR No. 3)

Please take notice that the above Execution Petition had filed for Attachment of your salary for recovery of EP amount and the Hon'ble Court ordered notice to you and posted the matter to 11-04-2023 for your appearance. So you are here by requested to appear before the Hon'ble I Additional Junior Civil Judge Court at Vijayawada to answer the execution Petition on 11-04-2023 at 10-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble I Additional Junior Civil Judge, Vijayawada)
A.PRASOON KUMAR
Advocate, D.No.25-104,
Yanamalakuduru
Vijayawada-7
Date of Adjournment: 11-04-2023
Vijayawada
27-03-2023

XVI Additional District and Session Court At Nandigama.
Case No. : EP/0000769/2017
IN
A.O.P/702/2013
M/s. Cholamandalam Investment and Finance Co.Ltd.,

Represented by Shaik Abdul Kareem Versus Karii Kondala Rao and 2 others

Immovable property residential building situated in bearing D.No. 39-582,39-1784 of Nandigama to an extent of 248.05 Sq.Yards in Nandigama Sub Registry bounded by
East: Property of Karri Venkata ramaiah ; West : Executent site ; South: Property of Kondapalli Nageswara Rao ; North : Road
Dhr Value Rs. 20,00,000 Ameen Value Rs. 20,00,000 Proclaim and sale on 10.04.2023 and for further hearing call on 17/4/2023

మహారాజశ్రీ మచిలీపట్నం 6వ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టులో
ఎ.ఎస్.నెం. 24/2022

బిట్వీన్ :
జోగి ఆదినారాయణ ...అప్పెలెంట్/ప్లెయింటిఫ్
మరియు
బడుగు సూరయ్య (డైడ్) అండ్ అదర్స్
... రెస్పాండెంట్స్ / డిఫెండెంట్స్

టు:
R 6) చింతల శివయ్య, తండ్రి : (లేటు) అప్పారావు, కోట వనపాలెం, నందమూరు, పెదన మండలం.

పై నెంబరు ఎ.ఎస్.24/2022రులో 6వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది. 18-04-2023న వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ, లేదా మీ తరపు అడ్వకేటుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమున మరియు మీకు వ్యతిరేకంగా తదుపరి గ్రంథములు జరిపించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 18-04-2023

సోడిశెట్టి బాలాజీరావు
అప్పెలెంట్/ప్లెయింటిఫ్ తరపున న్యాయవాది
ది.03-04-2023 **మచిలీపట్నం.**

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
EP No. 30 of 2021
in
O.S No. 719 of 2013

Between:
Kapil Chit Funds Pvt. Ltd
Vijayawada-1 Branch, Rep. by It's
Assistant Divisional Manager
... DHR

AND

Eddum Siva Prasad and others
... JDRS

Notice to JDR No. 2.
Kondaigunta Naga Malleswara Rao, S/o. Adi Narayana, Senior Assistant, Commercial Taxes Department, Suryaraopeta Circle, Yanamalakuduru Road, Krishna Nagar, Vijayawada.
(JDR No. 2)

Please take notice that the above Execution Petition had filed for Attachment of your salary for recovery of EP amount and the Hon'ble Court ordered notice to you and posted the matter to 18-04-2023 for your appearance. So you are here by requested to appear before the Hon'ble I Additional Junior Civil Judge Court at Vijayawada to answer the execution Petition on 18-04-2023 at 10-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble I Additional Junior Civil Judge, Vijayawada)
A.PRASOON KUMAR
Advocate,
D.No.25-104, Yanamalakuduru,
Vijayawada-7
Date of Adjournment: 18-04-2023
Vijayawada
27-03-2023

SUMMON NOTICE
BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA.
FILE No. A.A/CF/No. 294 OF 2022

Between:-
M/s. KAPIL CHITS (TELANGANA) PVT. LTD, Kodad Branch, Represented by its Legal Officer, M.Narsimha Raju, S/o. Pitchaiah, Age about 38 years, R/o. Nalgonda town & District.
...Disputant

AND

1. Chirumamilla Kondal Rao, S/o. Krishnamurthi, Age about 34 years, Occ: Sr.Chemist, R/o. H.No.1-85, Mungacharla Village, Nandigama Mandal, Krishna District.
2. Vadde Susheel Kumar, S/o. Veera Bhadra Rao, Age about 33 years, Occ: Sr Operator, R/o. H.No. 2-195, Muktyala Village, Jaggaiahpet Mandal, Krishna District.
3. Chintala Narasimha Rao, S/o. Ramulu, Age about 35 years, Occ: Sr Executive, R/o. H.No.1-127, Near Water Tank, Penuganchiprolu Town, Krishna District.
4. Nuthalapati Pavan Kumar, S/o.Narsimha Rao, Age about 29 years, Occ: Chemit, R/o. H.No.16-33, Near Post Office Street, Padmata Bazar, Penuganchiprolu Town, Krishna District.

...Opponents.

Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription U/s. 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s. 33 of Chit Fund Act, 1982, for the chit series TKDT08F Ticket No.19 Which was sanctioned bearing Vide PSC No.301/2017 dated on 29-07-2017 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982.

As on the date of filing disputed Claim is Rs. 16,198-00.

You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Nalgonda District Register Office Municipal Complex, Nalgonda town and District, in person duly on Dt 10-04-2023 At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.

Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as ex-parte.

DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR
NALGONDA DISTRITCT
DISTRICT REGISTAR OFFICE
MUNCIPAL COMPLEX NALGONDA.

SUMMON NOTICE
BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA.
FILE No. A.A/CF/No. 296 OF 2022

Between:-
M/s. KAPIL CHITS (TELANGANA) PVT. LTD, Kodad Branch, Represented by its Legal Officer, M.Narsimha Raju, S/o. Pitchaiaha, Age about 38 years, R/o. Nalgonda town & District.
...Disputant/Petitioner,

AND

1. Dandugula Chandrashekar, S/o. Lakhmaiah, Age about 42 years, Occ: Business, R/o. H.No. 3-131/A, Nayanagar, Ananthagiri Road, Kodad Town, Suryapet District.
2. Seelam Kamalakar, S/o. Punnaiah, Age about 33 years, Occ: Police Constable-34, R/o. H.No.8-6, SC Colony, Near CSI Church, Gudibanda Village, Kodad Mandal, Suryapet District.
3. Kasani Srinivasa Rao, S/o. Ramulu, Age about 29 years, Occ: Business, R/o. H.No. 1-72, Kapugalu Village, Kodad Mandal, Suryapet District.
4. Kundavarapu Venkatesh, S/o. Guravaiah, Age about 41 years, Occ: Business, R/o. H.No. 2-62/1, Anumachalpalli Village, Jaggaipet Mandal, Krishna District.

...Opponents/Respondents.

Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription U/s. 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s. 33 of Chit Fund Act, 1982, for the chit series TKDT02H Ticket No.45 Which was sanctioned bearing Vide PSC No. 88/2019 dated on 26-03-2019 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982.

As on the date of filing disputed Claim is Rs.2,09,105 -00 .

You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Nalgonda District Register Office Municipal Complex, Nalgonda town and District, in person duly on Dt. 10-04-2023 At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.

Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as ex-parte.

DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRITCT
DISTRICT REGISTAR OFFICE
MUNCIPAL COMPLEX NALGONDA.

SUMMON NOTICE
BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA.
FILE No. A.A/CF/No. 308 OF 2022

Between:-
M/s. KAPIL CHITS (TELANGANA) PVT. LTD, Kodad Branch, Represented by its Legal Officer, M.Narsimha Raju, S/o. Pichaiah, Age about 39 years, R/o. Nalgonda town & District.
...Disputant/Petitioner,

AND

1. Mogalagani Sujatha, W/o. Sathish Kumar, Age about 35 years, Occ: House Wife, R/o.H.No.3-2-31,Siri Complex,Main Road, Chillakallu Village,Jaggaiahpet Mondal, Krishana District.
2. Mogalagani Sathish Kumar, S/o. Mallesham, Age about 40 years, Occ: Line Men , R/o.H.No.3-2-31,Siri Complex,Main Road, Chillakallu Village,Jaggaiahpet Mondal, Krishana District.
3. Madapu Suryanarayana, S/o.Veerabhadram , Age about 39 years, Occ: Line Men , O/o. APSPDCL, Muppala, Nadigama Mondal,Krishana District.
4. Shaik Jansyda, S/o. Janmiya, Age about 33 years, Occ: Asst Line Men ,R/o.H.No.1-105,Shivalyam Temple Bazar, Sangapandu Village,Penuganchiprolu Mondal,Krishana District.

...Opponents/Respondents.

Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription u/s. 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s. 33 of Chit Fund Act, 1982, for the chit series TKDT08F Ticket No.35 Which was sanctioned bearing Vide PSC No.301/2017 dated on 29-07-2017 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982.

As on the date of filing disputed Claim is Rs. 7,700-00.

You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Nalgonda District Register Office Municipal Complex, Nalgonda town and District, in person duly on Dt. 10-04-2023 At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.

Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as ex-parte.

DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR NALGONDA DISTRITCT
DISTRICT REGISTAR OFFICE
MUNCIPAL COMPLEX NALGONDA.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న గ్రామ రెవెన్యూ సంఘం నాయకులు



వినతిపత్రం అందిస్తున్న ఎన్‌పిఆర్‌డి నాయకులు



వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్షా - కెవివిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కా రించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జేఏసీ)ఆధ్వర్యంలో సోమవారం కలక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్ ఎన్ దేవేంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం ఆఫ్ టైంస్కేలు అమలు చేసి వేతనాలు పెంచి 15 నెలలు గడుస్తున్నా సమగ్ర శిక్షా ఉద్యోగుల వేతనాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం చొరవ చూపడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడంతో జీవనం దుర్భరంగా మారిందని, ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీదేవి, టి.సూర్య కళా, సి హెచ్ విశాలాక్షి, డి కల్పన, ఏ.లావణ్య, ఎల్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఒ పోస్టులు భర్తీ చేయాలని వినతి

ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న విఆర్‌ఓ పోస్టులన్ని వెంటనే భర్తీ చేయాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరత్నం, కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల రమేష్‌ల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏ నుండి సీనియార్టీ ప్రకారం నైట్ వాచ్మెన్లు, అటెండర్లు, చైన్మ్యాన్ పోస్టులు ఎన్ని ఖాళీగా ఉంటే అన్ని ఖాళీల్లో వీఆర్ఏలతోనే భర్తీ చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు వెన్న వెంకటేశ్వరావు, తదితరులు ఉన్నారు.

గంజాయిని అరికట్టాలి : టిడిపి

జిల్లా లో గంజాయి, డ్రగ్స్ ను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కలక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా ప్రసాద్ మాట్లాడుతూ కష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంతో పాటు జిల్లాలో అనేక ప్రాంతాల్లో గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగం గత కొద్ది రోజులుగా విపరీతంగా పెరిగిందని ముఖ్యంగా నగరంలో పలుచోట్ల గంజాయి విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతున్నాయన్నారు. వీటిని అరికట్టాల్సిన పోలీసులు పూర్తిగా విఫలం అవుతున్నారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఎండి సలీం, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు పిన్నింటి అయ్యప్ప, డొక్కు సాయి,మనికుమర్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాలలో సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైయ్యాయి. మొవ్వ"ఏ' సెంటర్లో 128 మందికి ఇద్దరు బాలురు, మొవ్వ"బి"(ఒకేషనల్) సెంటర్లో 113 మందికి ఇద్దరు బాలురు, నిడుమోలు సెంటర్లో 52 మంది విద్యార్థులకు ఒక బాలుడు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి ఎన్ శివశంకరరావు పేర్కొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి:** మోపిదేవి మండలంలోని పదోతరగతి పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ కూరపాటి నవీన్ కుమార్, ఎస్సై పద్మ పరిశీలించారు. మోపిదేవి జిల్లా పరిషత్ హై స్కూల్లో 183 మంది పూర్తిస్థాయి విద్యార్థులు, గురుకుల పాఠశాలలో 93 మంది పూర్తిస్థాయి విద్యార్థులు, పెదకళ్ళేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో 73 మంది విద్యార్థులకు గాను 72 మంది పరీక్షలకు హాజరయ్యారు.



మొవ్వలో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

మంచినీటి పథకం నిర్మాణం ప్రారంభం



ప్రజాశక్తి- ఘంటసాల : రాజ్యసభ్య సభ్యులు కనక మేడల రవీంద్ర కుమార్ అందించిన నిధులు రూ.26 లక్షలతో ఘంటసాల గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో 40 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. 2022 జనవరి 10న రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ను ఘంటసాల ఉపసర్పంచ్ అయినపూడి భానుప్రకాష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు కలిసి ఘంటసాల అంబేద్కర్ నగర్ వాసులు పడుతున్న నీటి ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్పందించిన రాజ్యసభ సభ్యులు రూ.26 లక్షల నిధులు కేటాయించగా పనులు సోమవారం ప్రారంభమ య్యాయి. ఈ పథకం నిర్మాణం పూర్తయితే ఘంటసాల గ్రామ పంచాయతీలోని అంబేద్కర్‌నగర్, 1వ వార్డు, నూతనంగా నిర్మించే జగనన్న కాలనీలకు వాసులకు మంచినటి ఎద్దడి తొలగనుంది.ఉపసర్పంచ్ అయినపూడి భానుప్రకాష్, టీడీపీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాస్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఉలవపూడిలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉలవపూడి, వేమవరం గ్రామాల్లో గుడివాడ టిడిపి పార్టీ ఇంచార్జ్ రావి వెంకటేశ్వరరావు ఇంటి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రాన్ని అభివద్ధి చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వులవలపూడి సర్పంచ్ కన్నె భాస్కరరావు, రామయ్య, అబ్దుల్ సత్తార్, పామర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో టిడిపి గెలుపు ఖాయం : వెనిగండ్ల

ప్రజాశక్తి - గుడివాడ : 2024 ఎన్నికల్లో గుడివాడను గెల్చుకోవడమే తన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెనిగండ్ల రాము తెలిపారు. గుడివాడ పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సంపద దోపిడీకి గురైందని, రాష్ట్రాన్ని కాపాడేందుకు చంద్రబాబు పోరాటం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆర్థిక అసమానతలను తగ్గించే విధానానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రతి ఇంటికీ ఒక విజన్ ను రూపొందించడం ద్వారా పేదప్రజల జీవితాల్లో సమూల మార్పులను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గుడివాడ నియోజకవర్గంలో అభివద్ధి కన్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోట శ్రీరంజని, వార్డు ప్రముఖులు కోట శ్రీనివాస్ (బొంబాయి శ్రీను), చిగురుపాటి విలియమ్స్, ఎస్ రాజశేఖర్, గూడపాటి రాజశేఖర్, వీరిశెట్టి రవితేజ, ప్రగడ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి



ప్రజాశక్తి-పెడన : పదవ తరగతిలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో మెరిట్ పొందిన విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున 50 వేల రూపాయలను అందించనున్నట్లు రాంప్రసాద్ తెలిపారు. అలాగే పదవ తరగతిలో జిల్లా స్థాయిలో మెరిట్ సాధించిన వికలాంగులకు కూడా తాను ఆర్థిక సహకారం అందించనున్నట్లు చెప్పార.ు విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి విజయం సాధించాలని రాంప్రసాద్ ఆకాంక్షించారు.



వినతిపత్రం అందిస్తున్న వర్లకుమార్ రాజా

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై పామర్రు మండలం జుజ్జువరం గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మించేటప్పుడు కనీసం సబ్ వే కూడా నిర్మించకపోవడం వలన అక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా యని కాబట్టి ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని పామర్రు నియోజక వర్గ టిడిపి ఇంఛార్జి వర్ల కుమార్ రాజా సోమవారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ను కలసి వినతి పత్రం అందజేశారు.అనంతరం కుమార్ రాజా మాట్లాడుతూ ఆ ప్రాంతాల్లో కనీసం వీధి దీపాలు కూడా లేక గత నాలుగేళ్లలో 16 మందికి పైగా ప్రమాదాలు జరిగి చనిపోయారని, 200 పైగా క్షత్తగాత్రులు అయ్యారనీ, ఈ విషయం పై గురించి పలుమార్లు అధికారుల దష్టికి తీసుకువెళ్లిన వారు స్పందించలేదని, కనీసం ఆ ప్రాంతంలో వీధి దీపాలైన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర ,మచిలీపట్నం కార్యలయ కార్యదర్శి బత్తిన దాస్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు జన్ను శోభన్ బాబు ,,జ్జుజవరం గ్రామ పార్టీ అధ్యక్షులు జన్ను నాగమురళి ,చాట్ల రమేష్ ,మచిలీపట్నం పార్లమెంటరీ ఎస్ సి సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ,గోరిపర్తి నాగబాబు ,వల్లూరు కిరణ్ .మరియు జుజ్జువరపు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కెజి గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందజేసి అభినందిస్తున్న సర్పంచ్, పాఠశాల యాజమాన్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద కిండర్ గార్డెన్ నర్సరీ యూకేజీ స్థాయి దాటి వచ్చే విద్యా సంవత్సరం ఫస్ట్ క్లాస్ స్టూడెంట్స్ గా అడుగు పెడుతున్న సందర్భంగా యూకేజీ విద్యార్థిని విద్యార్థులకు కేజీ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్స్ సోమవారం అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ మౌళి థామస్ ప్రిన్సిపాల్ షైనీ జేమ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన అవనిగడ్డ సర్పంచ్ జి ఉమా పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దివిసీమలో విద్యార్థుల భవిష్యత్తును ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా తీర్చిదిద్దడంలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాత్ర అభినందనీయమన్నారు. ఏదైనా డిగ్రీ యూనివర్సిటీ చదువులు చదివిన వారికి ఇచ్చే పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు విద్యార్థి దశ ప్రారంభంలోనే వారిని ప్రోత్సహిస్తూ కేజీ సర్టిఫికెట్స్ ఇవ్వడం గొప్ప స్ఫూర్తిగా కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు చదువులపై శ్రద్ధ ఆసక్తి పెరుగుతుందని వారి తల్లిదండ్రులకు పిల్లల చదువుల పట్ల మరింత శ్రద్ధ పెంచుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు ఎంతగానో పేరెంట్స్ ను విద్యార్థులను అలరించాయి. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

కోడూరులో 'వెల్ బేబీ షో'

ప్రజాశక్తి-కోడూరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కోడూరు శివారు ఐబిపేట హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వద్ద సోమవారం వెల్ బేబీ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వయసుకి తగ్గ ఎత్తు బరువు వున్న పిల్లలను గుర్తించి వారికి బహుమతులు అందించారు. పిల్లలతల్లులకు, గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీ సెంటర్లలో ఇచ్చే పోషక ఆహారాల గురించి,వాటిని సక్రమంగా వినియోగించుకోనుట గురించి, ముక్కు పద్మజ అవగాహన కల్పించారు.

హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా హనుమంతరావు ఎంపిక

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు సంబంధించి హైకోర్టు ఆంధ్రప్రదేశ్ స్టాండింగ్ కౌన్సిల్‌గా



ప్రముఖ అడ్వకేట్ బాచిన హనుమంతరావు ఎంపికయ్యారని మహారాష్ట్ర బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.రజనికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి బ్యాంకు లావాదేవీలు, ఇతర కార్యకలాపాలు, లావాదేవీలను పరిష్కరించేందుకు హనుమంతరావు ఎంపికయ్యారని తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి అంబటి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను సోమవారం రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్



కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

'ఆర్యవైశ్యులపై దాడులను అరికట్టాలి'

ప్రజాశక్తి-కంచికచర్ల: వైసిపి అధికారం చేపట్టిన నాటినుండి ఆర్యవైశ్యులపై దాడులు పెరిగాయని, పోలీసులు సైతం దాడులు చేసిన వారికి కొమ్ము కాస్తూ బాధితులను శిక్షిస్తున్నారని స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆరోపించారు. శనివారం తెనాలి కౌన్సిల్ హాల్లో జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనమన్నారు. సోమవారం కంచికచర్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ తెనాలి కౌన్సిలర్ యుగంధర్‌ను వైసిపికి చెందిన కౌన్సిలర్లు విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారన్నారు. ప్రజా సమస్యల మీద స్పందించిన, ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తక్షణం పోలీసులు స్పందించి దాడులకు పాల్పడిన వైసిపి కౌన్సిలర్లపై కేసులు నమోదు చేసి యుగంధర్‌కు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అత్తులూరి యాదగిరి నరసింహారావు, వేములపల్లి వెంకటరత్నం, వాసవి యువసేన అధ్యక్షులు జూలూరు విశ్వనాథం, పమిడిమర్రి పవన్, చందులూరి శ్రీకాంత్, దొడ్డ మహేష్ పాల్గొన్నారు.

అన్నపూర్ణ సేవా సమితి వార్షికోత్సవం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అన్నపూర్ణ సేవా సమితి తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా అన్నపూర్ణ సేవా సమితి ప్రతినిధి మహంకాళి జయప్రకాష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని పాతపేట గడ్డ అలంకార్ థియేటర్ రోడ్ లోని వెండి మహాలక్ష్మి అమ్మవారి ఆర్చి వద్ద, మహంకాళి జయప్రకాష్ నివాసం వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహంకాళి జయప్రకాష్, సంగాపు మణికంఠ శ్రీనివాస్, కౌన్సిలర్ నూకల సాంబశివరావు, చౌడవరపు సాయి, బండారు కిరణ్‌కుమార్, పవన్ పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కు పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సామినేని విశ్వనాధం చిల్డ్రన్ పార్కును పట్టణ మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు సోమవారం పరిశీలించారు. పార్కులో లైటింగ్, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట సామాగ్రికి రంగులు వేయించాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్డ వెంబడి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గంపలగూడెం: ఎన్టీఆర్ జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. మోడల్ స్కూల్లో జరిగిన ఈ పరీక్షల్లో 22 మందికి కళ్లజోళ్ళు అవసరమైనట్లు గుర్తించి అందజేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆర్.శైలజ, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ కృతి, కంటి వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా రాకేష్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్

కెఎల్ రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ 11వ వార్షికోత్సవ వేడుకలు పాఠశాల డైరెక్టర్ ఎన్.వి. రావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వైఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏపిఎస్ఎండిఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ మస్తాన్, ఏపి రాజ్‌భవన్ ఉన్నతాధికారి ఎం.వి.వి. సత్యనారాయణమూర్తి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మహ్మద్ మస్తాన్ మాట్లాడుతూ విద్యార్థి దశ అత్యంత ముఖ్యమైనదని, నిరంతరం మారుతున్న పోటీ ప్రపంచంలో సఫలీకృతం అవడానికి రాకేష్ పబ్లిక్ స్కూల్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. నేటి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న పాఠశాల డైరెక్టర్ ఎన్.వి. రావును కొనియాడారు. ఏపి రాజ్‌భవన్ ఉన్నతాధికారి ఎంవివి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని, నేటి కష్టే రేపటికి ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందన్నారు. అంతరిక్ష వ్యోమగామి శ్రీ రాకేష్ శర్మ స్వహస్తాలతో ప్రారంభించిన ఈ విద్యా సంస్థ ఉన్నతమైన ఆశయాలతో విద్యార్థులను తీర్చిదిద్దటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బ్రాంచ్ కో-ఆర్డినేటర్ బి. కమల, రమేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమం నందు వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు సుమారు 92 మందికి బహుమతులను అతిధుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంవివిఎస్ మూర్తిచే వ్రాయబడిన కాలచక్ర డైరీని ఆవిష్కరించారు.



బహుమతి అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ ఎన్‌వి రావు



ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి : టిడిపి

ప్రజాశక్తి-వత్సవాయి

చిలకల్లు వైరా రహదారిపై వత్సవాయి బోనకల్లు గ్రామాల మధ్యలో ఆంధ్ర చెక్‌పోస్ట్ వద్ద ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర సరిహద్దు



నుండి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలివెళ్తున్న ఇసుక లారీలను టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో పేదలకు ఉచితంగా ఇసుకను అందిస్తే నేడు వైసిపి ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు అక్రమంగా అమ్ముకుంటుందని అన్నారు. ఇసుక మాఫియాకు స్థానిక ఎమ్మెల్యేతో పాటు అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్నారు. వెంటనే ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు, కణతాల రామకృష్ణ, జగ్గయ్యపేట పట్టణ టిడిపి అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, నాయకులు చిట్టూరి రమేష్, నెల్లూరి శ్రీనివాసరావు, పెద్ది రామారావు, నెల్లూరి వెంకటనారాయణ, ఆవుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

జొన్న పైరు పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి నేలకొరిగిన జొన్న, మొక్కజొన్న పైరులను మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు సోమవారం పరిశీలించారు. గ్రామాల వారీగా క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. నున్న, పరిసర ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాలలో జొన్నకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు చెప్పారు. 12 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లిందన్నారు.



ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: మహిళలకు ఆసరా చెక్కులను సోమవారం స్థానిక 55వ డివిజన్ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద 54, 55 డివిజన్లలోని స్వయం సహాయక సంఘాలలోని అక్కా చెల్లెమ్మలకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అందచేసారు. 178 స్వయం సహాయక సంఘాలలోని



1780 మంది అక్కా చెల్లెమ్మలకు రూ.1.31 కోట్ల విలువైన చెక్కును అందచేశారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు అబ్దుల్ అర్షద్, శిరంశెట్టి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి-గంపలగూడెం: రాజవరం గ్రామానికి చెందిన పిఎసిఎస్ సభ్యుడు మోదుగు ముత్తయ్య ఇటీవల మృతిచెందడంతో మట్టి ఖర్చుల నిమిత్తం జిల్లా బ్యాంకు నుండి రూ.6 వేలు, స్థానిక సొసైటీ నుండి రూ.4 వేలు మృతుని కుమారుడు గోపాలకృష్ణకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు చెన్నిపాడు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు కొత్తపేటలో అన్నదానం

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామ స్వామి వారి దేవస్థానంలో ఈనెల 5వ తేదీన ఉదయం వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరగనుంది. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థాన కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు (పిసి), సోమవారం విలేకరులతో మాట్లాడుతూ శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీ సీతారామ స్వామివార్లను దర్శించుకుంటున్నారని వారు చెప్పారు. ఈ నెల 5వ తేదీ ఉదయం 11 గంటల నుంచి శ్రీ నగరాల సీతారామస్వామి దేవస్థానం ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించటం జరుగుతుందన్నారు. శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతం కావడంలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

5న నాగరాజన్ దీక్ష

ప్రజాశక్తి-భవానీపురం: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ నెల 5వ తేదీన గాంధీనగర్‌లోని ధర్నా చౌక్‌లో సత్యాగ్రహ నిరాహార దీక్ష చేయనున్నట్లు గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ ప్రకటించారు. సోమవారం గాంధీ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం బిజెపి పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని ప్రధాని మోడీ , బిజెపి పాలకులు అప్రజాస్వామ్యంగా తొలగించారన్నారు. వెంటనే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

నేడు రైతులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గరికపాడు డాక్టర్ కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రైతులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కెవికె ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (అటారి) హైదరాబాద్ సంచాలకులు డా. షేక్ ఎన్ మీరా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నందిగామ మండలం పల్లగిరి గ్రామంలో మెగా పశువైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గొల్లపూడిలో కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడరూరల్ : గొల్లపూడిలోని శ్రీనివాస్ నగర్‌లో రూ.4.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను రాష్ట్ర విద్యుత్, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో తొలి కంటైనర్ సబ్ స్టేషన్ అన్నారు. గొల్లపూడిలో ప్రయోగాత్మక నిర్మాణమని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం 13 మీటర్ల పొడవు, 4.5 మీటర్ల వెడల్పుతో నిర్మించిన ఈ కంటైనర్ సబ్ స్టేషన్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సాధారణ సబ్‌స్టేషన్‌కు 20 సెంట్ల స్థలం అవసరం అయితే కంటైనర్ సబ్‌స్టేషన్‌కు 2 నుంచి 3 సెంట్ల స్థలం సరిపోతుందన్నారు. అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు వీలుంటుందన్నారు. ఈ



మాట్లాడుతున్న మంత్రి రామచంద్రారెడ్డి

కార్యక్రమంలో ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, జడ్‌పిటిసి సువర్ణరాజు, ఎంపిపి ప్రసన్నకుమారి, వైస్ ఎంపిపి సురేష్, సొసైటీ ఛైర్మన్ బొర్రా వెంకట్రావు, మాజీ వైస్ ఎంపిపి కాటంనేని పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.